ఇక రయ్.. రయ్

సౌకర్యవంతంగా బీటీ రోడ్లు

- రూ.28 కోట్ల వ్యయంతో పూర్తయిన నిర్మాణం
- రైతులకు సౌకర్యవంతంగా రహదారులు
- రోడ్ల నిర్మాణంతో పెరిగిన భూముల రేట్లు



తల్లాడ - మంగాపురం గ్రామాల మధ్య నిర్మించిన బీటీ రోడ్డు

గతంలో రోడ్లపై ప్రయాణించాలంటే నరకం కనిపించేది. పంటపొలాలకు వెళ్లాలంటే ఇదే రోడ్డు కావడంతో అష్టకష్టాలు పడేవారు. గుంతల రోడ్లపై పడుతూ లేస్తూ ప్రయాణం చేయాల్సి వచ్చేది. అడుగడుగునా గుంతలు.. అతుకుల బొంతలా ఉండేవి. అలాంటిది ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.. రహదారులపై రైతులు, ప్రయాణికులు రయ్.. రయ్ మంటూ ప్రయాణాలు సాగిస్తున్నారు.

తల్లాడ: తల్లాడ మండలం పూర్తి వ్యవసాయాదారమైనది. 70శాతం మంది వ్యవసాయం మీదనే ఆదారపడి జీవిస్తున్నారు. నేల తల్లిని నమ్ముకొని సేద్యం చేస్తున్నారు. ఎస్‌డీఎఫ్, ఎంఎంఎఫ్‌టీ, పంచాయతీరాజ్ నిధులతో చేపట్టిన రోడ్లు రైతులకు వరప్రదాయినిగా మారాయి. తల్లాడ నుంచి నాలుగు వైపులా ఎటు వెళ్లాలన్నా, ఏగ్రామం వెళ్లాలన్నా, పొలాలకు వెళ్లాలన్నా రోడ్డు సౌకర్యం కలిగి ఉంది.

11 గ్రామాలకు సౌకర్యం..

తల్లాడ నుంచి మొత్తం 11 గ్రామాలకు రూ.28 కోట్ల వ్యయంతో నాలుగు రోడ్లు నిర్మాణం జరిగింది. 2023–24 సంవత్సరంలో ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు కాగా, రూ.11 కోట్ల వ్యయంతో తల్లాడ-కొడవటిమెట్ల వరకు వయా నారాయణపురం నుంచి రూ.9 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి అయ్యింది. సుమారు ఆరున్నర కిలోమీటర్ల వరకు ఉన్న ఈ రోడ్డు తల్లాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నారాయణపురం గ్రామ చివరి వరకు కిలో మీటరు మినహాయిస్తే మిగిలిన రోడ్డంతా పంట పొలాల మధ్యనుంచే వెళ్తుంది.

– నారాయణపురం ఊరి చివర నుంచి వైరా రిజర్వాయర్ వరకు, కొడవటిమెట్ల వద్ద ఉన్న పొలాలకు వెళ్లాలంటే ఆయా గ్రామాల రైతులు బురదలో నుంచే వెళ్లాల్సి వచ్చేది. ఇటీవల రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ రోడ్డును ప్రారంభించారు. తల్లాడ-అన్నారుగూడెం వరకు ఎంఎంఎఫ్‌టీ నిధులు రూ.6 కోట్లతో 5 కిలోమీటర్ల దూరం వరకు రహదారి నిర్మించారు. దీంతో కిలో మీటరు దూరం తగ్గింది. తల్లాడ-మంగాపురం గ్రామాల వరకు పీఆర్ నిధులు రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణం జరిగింది. తల్లాడ ఎదుళ్ల చెరువు పక్క నుంచి రెండున్నర కిలో మీటర్ల దూరం వరకు రోడ్డు పూర్తి అయ్యింది. మంగాపురం, తల్లాడ, నారాయణపురం గ్రామాలకు చెందిన రైతులకు ఈ రోడ్డు సౌలభ్యంగా ఉంది.



తల్లాడ - కొడవటిమెట్ల గ్రామాల మధ్య..

రూ.11 కోట్లతో మల్లవరం – గంగదేవిపాడు వరకు..

రూ.11 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధులతో మల్లవరం నుంచి గంగదేవిపాడు వరకు 6-1/2 కిలో మీటర్ల పొడవు బీటీ రోడ్డు నిర్మాణం జరుగుతుంది. ఈ రోడ్డు కూడా 70శాతం పూర్తి అయింది. మల్లవరం వరకు రోడ్డు బీటీ వేశారు. మల్లవరం, గంగదేవిపాడు, బాలపేట గ్రామాల రైతులకు ఈ రోడ్డు సౌకర్యంగా ఉంటుంది. అదే విధంగా తల్లాడ, నారాయణపురం గ్రామాల్లో 20 అడుగుల వరకు సీసీ రోడ్డు వేయడంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తల్లాడ - నారాయణపురం సమీపంలో నిర్మించిన సీసీ రోడ్డు

పెరిగిన భూముల ధరలు..

తల్లాడ నుంచి 11 గ్రామాలకు పంట పొలాల మధ్య నాలుగు రోడ్లు నిర్మాణం జరగడంతో ఆయా గ్రామాల్లో భూముల రేట్లు పెరిగాయి. రోడ్డు సౌకర్యం ఏర్పడటంతో అంతకు ముందు ఎకరం భూమి ధర రూ.20 లక్షలు ఉండగా, నేడు రూ.30 నుంచి రూ.40 లక్షల వరకు ధర పలుకుతున్నాయి. రోడ్డు సౌకర్యం ఉండడంతో రహదారుల వెంట ఉన్న పొలాల పట్ల మక్కువ చూపుతున్నారు.

రైతుల కష్టాలు తీరాయి..



తల్లాడ నుంచి కొడవటిమెట్ల, మంగాపురం వరకు తారు రోడ్ల నిర్మాణం జరిగింది. రోడ్ల నిర్మాణంతో రైతుల కష్టాలు కడతేరినట్లైంది. రోడ్డు వేయక ముందు రాకపోకలకు అంతరాయం కలుగుతుండేది. ఎరువులు చేరవేయడానికి గానీ, పంటలను ఇంటికి చేర్చుకోవడానికి ఎన్నో అవస్థలు పడేది. ఇప్పుడు అలా కాకుండా నేరుగా వాహనాలపై వెళ్లేందుకు రహదారి సౌకర్యం ఏర్పడింది.

– రెడ్డి జమలయ్య, రైతు, నారాయణపురం

ఆయిల్ పామ్ సాగు లాభదాయకం

ఎర్రుపాలెం: మండలంలోని నర్సింహాపురం గ్రామంలో గురువారం ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతులకు ఉద్యానవన అధికారి విష్ణు, మండల వ్యవసాయాధికారి సాయిశివ అవగాహన కల్పించారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు గడించవచ్చని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆయిల్ పామ్ పంట లాభదాయకంగా ఉందని, ఒకసారి నాటితే 30 సంవత్సరాల వరకు ఆదాయాన్ని ఇచ్చే పంట ఆయిల్‌పామ్ అన్నారు. ఈ పంట సాగుకు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100శాతం, బీసీల్లోని సన్న కారు రైతులకు 90శాతం, ఇతరులకు 80శాతం రాయితీపై డ్రిప్ పరికరాలు పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అసిస్టెంట్ రామకృష్ణ, తదితరులున్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

నానో ఎరువులతో లాభాలు అధికం

ఏన్కూరు: నానో ఎరువులతో అధిక లాభాలు అర్జించవచ్చని వ్యవసాయ అధికారి నర్సింహారావు తెలిపారు. గురువారం స్థానిక రైతువేదికలో ఇఫ్కో కంపెనీ మరియు వ్యవసాయశాఖ సంయుక్త అధ్వర్యంలో.. నానో ఎరువులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నానోయూరియా ప్లస్, నానో డీఏపీ వినియోగం ద్వారా సాంప్రదాయ ఎరువులపై ఆధారపడే అవసరాన్ని తగ్గించుకొని, దిగుబడి పెంపుతోపాటు భూసారం పరిరక్షించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇఫ్కో సేల్స్ ఆఫీసర్ నాగార్జున, డెవలప్‌మెంట్ ఆఫీసర్ మహిందర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారులు బాలకృష్ణ, శ్రీకాంత్, లహరి, నవ్య, భవ్య, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు

పెనుబల్లి: రైతులు సంప్రదాయ పంటల స్థానంలో ఉద్యానవన పంటలు సాగు చేస్తే లాభాలు వస్తాయని జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎం.వీ.మధుసూదన్ తెలిపారు. పెనుబల్లి మండలం గంగదేవిపాడులో సాగవుతున్న కూరగాయలు, పండ్లు, ఆయిల్‌పామ్ తోటలను గురువారం ఆయన పరిశీలించి మాట్లాడారు. ఉద్యానవన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు ఇస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డివిజన్ ఉద్యానవన అధికారి నగేష్, ఆయిల్‌ఫెడ్ డీఎం శంకర్, ఫీల్డ్ ఆఫీసర్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎం అభివృద్ధిని స్వాగతిస్తుంది'

ఎర్రుపాలెం: సీపీఎం గ్రామాల్లో అభివృద్ధిని స్వాగతించి, అరాచకాన్ని అణిచివేస్తుందని ఆ పార్టీ మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్, జిల్లా కమిటీ సభ్యుడు దివ్వెల వీరయ్య తెలిపారు. గురువారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. భీమవరం గ్రామంలో అధికారుల అనుమతులు లేకుండా తొలగించిన ప్రకృతి వనాన్ని, చెక్ డ్యామ్‌ను తిరిగి నిర్మించాలని, ఆమేరకు అధికార యంత్రాంగం స్పదించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పెద్ద కోటేశ్వరరావు హనుమంతరావు, సంజీవరావు, సుబ్బారెడ్డి తదితరులున్నారు.

అవగాహన అవసరం

ముదిగొండ: రైతులు ఎరువుల వాడకంలో అవగాహన కలిగి ఉండాలని మధిర ఏడీఏ విజయ చంద్ర అన్నారు. ముదిగొండ మండలంలోని రాఘవాపురం సమీపంలో పత్తి పంటలను పరిశీలించారు. రైతులకు పలు సూచనలు, సలహాలు చేశారు. నానో యూరియా గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ సరిత, ఏఈఓ మౌనిక, రైతులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగంలో జర జాగ్రత్త

సత్తుపల్లిటౌన్: ఇళ్లల్లో గ్యాస్ వినియోగంపై అవగాహన తప్పనిసరిగా ఉండాలని, సురక్ష రబ్బర్ ట్యూబ్‌నే వాడాలని సత్తుపల్లి ఇండేన్‌గ్యాస్ నిర్వాహకులు వందనపు సత్యనారాయణ అన్నారు. సత్తుపల్లి మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం గ్యాస్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్యాస్ ఉపయోగించే విధానంపై ప్రశ్నావళి నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించిన ఆర్.సుప్రియ, జి.కావ్య, ఓంశ్రీలకు బహుమతులు అందించారు. వంట అయిపోగానే రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయాలని, వంట చేసే వద్ద కాటన్ దుస్తులు ధరించాలని, లీకేజీ సమస్యలు ఉంటే 1906కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో కంపెనీ నిర్వాహకులు కోటగిరి సుధాకర్, డాక్టర్ మట్టా దయానంద్, కళాశాల ప్రిన్సిపాల్ చలసాని హరికృష్ణ, దొడ్డా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఇండేన్‌గ్యాస్ నిర్వాహకులు

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

చింతకాని: మండలంలోని మత్కేపల్లి, వందనం గ్రామాల్లో లబ్ధిదారులకు గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతున్న మత్కేపల్లి గ్రామానికి చెందిన నర్సింశెట్టి పద్మావతి, కాలంగి సైదులు, నాగంటి కల్యాణి, చిర్ర అచ్చమ్మ, ఎరుకల ప్రమీల, బొల్లికొండ అనసూర్య, పగడాల వీరబాబు, వంగా వెంకటలక్ష్మి, వందనం గ్రామానికి చెందిన మారం శ్రావణిలకు వైద్య ఖర్చుల నిమిత్తం డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన రూ.3.07 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు భట్టివిక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నాగార్జున్, కోటేశ్వరరావు, రామారావు, రామారావు, ప్రసాద్, శ్రీనివాసరావు, ఉపేందర్, వెంకన్న, మధు, బ్రహ్మాచారి, సంజీవరెడ్డి పాల్గొన్నారు.



చెక్కులు అందిస్తున్న నాయకులు

పీడీఎస్‌యూ జిల్లా కోశాధికారిగా శశికిరణ్

తల్లాడ: పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కోశాధికారిగా తల్లాడకు చెందిన గాజుల శశికిరణ్ ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనరల్‌బాడీ సందర్భంగా బుధవారం ఏక గ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం శశికిరణ్ విలేఖర్లతో మాట్లాడుతూ విద్యార్థుల సమస్యలపై సమర శీల పోరాటాలు చేస్తానన్నారు.



శశికిరణ్

క్లుప్తంగా

కంకర మిల్లులను తనిఖీ చేసిన ఆర్డీఓ

ఏన్కూరు: మండలంలోని పలు కంకర మిల్లులను ఆర్డీఓ రాజేందర్ గౌడ్, మైనింగ్ ఏఈ సాయినాథ్ గురువారం తనిఖీ చేశారు. గార్లఒడ్డు, జన్నారం, హిమామ్‌నగర్ గ్రామాల్లో కంకర మిల్లులను తనిఖీ చేశారు. కంకరమిల్లుల అనుమతులకు సంబంధించిన ధృవపత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేషగిరిరావు, ఆర్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జిల్లా జడ్జికి సన్మానం



జిల్లా జడ్జిని సన్మానిస్తున్న న్యాయవాదులు

మధిర: న్యాయాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజగోపాల్‌ను మధిర న్యాయవాదులు సన్మానించారు. ఖమ్మంలో గురువారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మధిర బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావుతో పాటు కట్టా పూర్ణచందర్‌రావు, సుంకు మోహన్‌దాస్, చింతల గోపాల్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ సీటు సాధించిన విద్యార్థినికి..

వైరారూరల్: మండలంలోని ఖానాపురం గ్రామానికి చెందిన షేక్.నాగుల్‌మీరా, జాన్‌బీల కుమార్తె జమీనా రెబ్బవరం జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి విద్యను అభ్యసించి 563 మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఇటీవల బాసర ట్రిపుల్ ఐటీ సాధించింది. ఈ సందర్భంగా గురువారం ఖానాపురం యూపీఎస్ హెచ్‌ఎం కిలారు శ్రీనివాసరావు అధ్యక్షతన జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యులు షేక్.లాల్ మహ్మద్ విద్యార్థిని జమీనాను శాలువాతో సత్కరించి అభినందించారు.

విలీన గ్రామదీపికలకు..

కల్లూరురూరల్: నూతనంగా కల్లూరు పురపాలక సంఘం ఏర్పాటుతో మండలంలోని ఏడు గ్రామాలకు చెందిన ఐకేపీ వీఓఏలు మున్సిపాలిటీలోకి రావడంతో వారిని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం శాలువాలతో సత్కరించారు. నగర దీపికలు కుమారి, రమాదేవి, ఫాతిమా, శివనాగలక్ష్మి, పుల్లమ్మ, సునీత, పుష్ప తదితరులతో పాటు ఐకేపీ వీఓఏలు వేము నాగమణి ఏఐటీయూసీ నాయకులు వేము రాంబాబు, దామాల దయాకర్‌రావులు సన్మానించారు. నగర దీపికలుగా వెళ్లిన వారు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించి వారికి ఆర్థికపరమైన సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

బుల్లెట్ యాత్ర చేసిన పురోహితుడికి..

సత్తుపల్లిరూరల్: బుల్లెట్‌పై 10వేల కిలోమీటర్ల ఆధ్యాత్మిక యాత్ర చేసిన పట్టణానికి చెందిన పురోహితుడు ఉప్పల ప్రవీణ్‌కుమార్ శాస్త్రిని గురువారం సత్తుపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ సత్కరించారు. ముప్పై రోజుల పాటు దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించి తన ఆధ్యాత్మిక యాత్రను పూర్తి చేయటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాసరావు, కృష్ణారావు, ఛాంద్‌పాషా, అనిల్, వేణు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పీడీపీఎస్ విధానాన్ని విరమించుకోవాలి

కారేపల్లి: పత్తి కొనుగోలుకు పీడీఎస్ విధానం విరమించుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పాటిమీదిగుంపు, బాజుమల్లాయిగూడెం గ్రామాల్లో పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీడీపీఎస్ విధానం వలన రైతు తన పంటను బహిరంగ మార్కెట్లో విక్రయించిన తర్వాత, డీబీటీ (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) పద్ధతుల్లో రైతు ఖాతాల్లో జమ చేశారని, ప్రభుత్వం నేరుగా రైతు పంటను కొనదని, దీని ద్వారా రైతు నష్టపోవాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మెరుగు సత్యనారాయణ, తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

పునాదులకే పరిమితం..

కొణిజర్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పునాదులకే పరిమితమయ్యాయి. మండలంలో పలు గ్రామాల్లో 652 ఇళ్లు మంజూరు చేశారు. మండల వాసులకు ఇందిరమ్మ మోడల్ భవన నిర్మాణం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా చేపట్టారు. అయితే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు పూర్తి అవుతున్నాయి కానీ మోడల్ భవనం మాత్రం పూర్తి కాలేదు. దీంతో మండల వాసులు అధికారుల తీరు పట్ల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా అధికారుల్లో తీరు మాత్రం మారడం లేదు.

బీఎల్‌వోల సమావేశం..

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో గురువారం నేషనల్ ట్రైనింగ్ ప్రోగ్రాం ఫర్ బూత్ లెవల్ ఆఫీసర్స్ కార్యక్రమంలో భాగంగా ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. బూత్ లెవల్ ఆఫీసర్ల విధి విధానాలను తహసీల్దార్ ఉషాశారద వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రవికుమార్, రాజశేఖర్, ట్రైనింగ్ అధికారులు రఫీ, జమీర్ తదితరులున్నారు.

వేంసూరులో వనమహోత్సవం

వేంసూరు: వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రాజారావు, హెచ్‌ఎం బీకే.నరసింహారావు పాఠశాల ఆవరణంలో కరివేపాకు, మునగ, మామిడి, సీతాఫలం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి

ముదిగొండ: ఉపాధ్యాయుల బదిలీలతో కూడిన ప్రమోషన్ షెడ్యూల్ విడుదల చేయాలని తపస్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి తెల్కపల్లి పెంటయ్య అన్నారు. ముదిగొండ మండలంలోని గురువారం న్యూలక్ష్మీపురం, పండ్రేగుపల్లి, ఖానాపురం, ముదిగొండ పాఠశాలలను సందర్శించి సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, జిల్లా కోశాధికారి రవికిరణ్, మండల అధ్యక్షుడు వీరభద్రం పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

బోనకల్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఐద్వా మండల కార్యదర్శి జొన్నలగడ్డ సునీత ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఐద్వా సభ్యులు సందర్శించి వైద్యాధికారి స్రవంతిని కలిశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్య కేంద్రంలో 18మందికి గాను 12మంది మాత్రమే స్టాఫ్ ఉన్నారని వెంటనే ఖాళీలను భర్తీ చేయాలన్నారు. గోవిందాపురం(ఎల్), బ్రాహ్మణపల్లి, మోటమర్రి, కలకోట సబ్ సెంటర్‌లలో ఖాళీ పోస్టులు ఉన్నాయని వాటిని కూడా భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు బంధం వెంకటరాజ్యం, రజిని, లక్ష్మి, వాణి పాల్గొన్నారు.

జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా

కొణిజర్ల: దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు కొణిజర్లకు చెందిన చల్లాసత్యం గురువారం ఆ సంఘం రాష్ట్ర నాయకులకు లేఖ రాశారు. గత ఏడాది కాలంగా సత్యం దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా పని చేశాడు అయితే అనారోగ్య కారణంగా తాను పదవిలో కొనసాగలేక పోతున్నానన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన

ఎర్రుపాలెం: మండలంలోని భీమవరం గ్రామంలోని 8మంది పేదలకు స్థానిక నాయకులు యరమల పూర్ణచంద్రారెడ్డి ఇళ్ల స్థలాలను ఇటీవల వితరణ చేసి పట్టాలు అందించారు. కాగా ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలను మంజూరు చేసింది. గురువారం దాత యరమల పూర్ణచంద్రారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. సకాలంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చావా రామకృష్ణ, నాయకులు కృష్ణారావు, శ్రీనివాసరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, సాంబశివరావు, నాగిరెడ్డి, రాజీవ్ గాంధీ, బాబురావు, వెంకటరామిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనానికి..

చింతకాని: మండలంలోని నర్సింహాపురం గ్రామంలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క గ్రామంలో అంగన్‌వాడీ నూతన భవన నిర్మాణానికి రూ.12 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. భవన నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి, ఏఈ రఘు, కాంగ్రెస్ నాయకులు భాస్కర్, గోపి, శ్రీనివాసరావు, గోవిందరావు, నాగార్జున్, రాంబాబు, అచ్చయ్య, రమణ, వెంకటేశ్వర్లు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కొణిజర్ల: అనారోగ్యంతో మృతి చెందిన మృతుడి కుటుంబానికి జిల్లా శాలివాహన సంఘం నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మండలంలోని రెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఇలాసాగరపు విశ్వనాథం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబాన్ని శాలి వాహన వెల్ఫేర్ ట్రస్ట్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తిగుళ్ల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి మొగిలిచర్ల వెంకటేష్, కోశాధికారి కొలిచలం సింహాచలం, డేర్ విద్యాసంస్థల చైర్మన్ కిరణ్, గౌరవ సలహాదారు కొల్లూరి పరశురాములు, గుమ్మడెల్లి సైదారావు, ఇలాసాగరపు ప్రసాద్, రాచర్ల రాజు, పొర్లు కృష్ణ,తదతరులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

బాధిత కుటుంబాలకు..

కల్లూరు: కల్లూరు పట్టణంలోని పలు సమస్యలతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు గురువారం మాజీ జెడ్పీటీసీ లక్కినేని రఘు ఆర్థిక సాయం అందించారు. అధైర్య పడొద్దంటూ భరోసా ఇచ్చారు. సైకిల్‌షాప్ మెకానిక్ రాము కాలికి గాయమై.. ఇంటికే పరిమితం కాగ, ఆ కుటుంబానికి 25 కేజీల బియ్యం, రూ.3 వేల నగదు అందించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న విలేకరి ఉబ్బన బాబూరావుకు రూ.3 వేలు, కప్పలబంధం రోడ్‌లో తోట ధర్మ తండ్రి దశదిన కర్మలో పాల్గొని కుటుంబ సభ్యులకు రూ.5 వేలు అందించారు. పుల్లయ్యబంజర్ రోడ్‌కు చెందిన కుండ లాలయ్య, కోట సులోచనలను లక్కినేని రఘు పరామర్శించారు.

ఘనంగా గురుపౌర్ణమి



గురుపౌర్ణమి పర్వదినాన్ని గురువారం సాయి మందిరాల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిమందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువజామునుండే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకుని, సాయినాధుడిని దర్శించుకున్నారు. సాయి నామ స్మరణలతో మార్మోగాయి. భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ చేశారు. కాగా, తల్లిదండ్రుల తరువాత గురువులే మార్గదర్శకులు అని పలు పార్టీల ఆధ్వర్యాన విద్యాలయాల్లో ఉపాధ్యాయులను సన్మానించారు. – సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: శ్రీషిర్డిసాయిబాబా మందిరంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి



మధిర : సాయిబాబా ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఎర్రుపాలెం: సాయి నిలయంలో హోమం చేస్తున్న అర్చకులు, భక్తులు



చింతకాని: పాతర్లపాడుబాబా ఆలయంలో..



వేంసూరు: మర్లపాడు బాబా ఆలయంలో..



సత్తుపల్లిరూరల్: కొత్తూరులోని బాబా ఆలయంలో..



బోనకల్‌లో..



కారేపల్లి: అన్నదానం చేస్తున్న భక్తులు



కల్లూరు: సాయిధ్యాన మందిరంలో గురువులను సన్మానిస్తున్న దృశ్యం



ఏన్కూరులో..



తల్లాడ: అన్నారుగూడెం ఆలయంలో..



ఎర్రుపాలెం: వెంకటాపురంలో గురువులు, తల్లిదండ్రులకు పాదాభివందనం చేస్తున్న చిన్నారులు



పెనుబల్లి: కోదండరామాలయంలో..

దాతకు సన్మానం..

వైరా: వైరా మున్సిపాలిటీ 5వ వార్డులోని సాయి నగర్‌లో, శాంతినగర్ హరిహరి సుత అయ్యప్ప క్షేత్రంలో, గండగలపాడు సాయి మందిరాల్లో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామనేని వరాలమ్మ కుమారుడు కోడలు నాగేశ్వరరావు, నర్మద కార్తీక్, నర్మద, ఈశ్వర్‌లు అన్నదానానికై రూ.25 వేలు విరాళం అందించగా.. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు, సాయి మందిర కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.



వైరా: దాతను సత్కరిస్తున్న మందిర కమిటీ సభ్యులు

శాకాంబరి అలంకరణలో ముత్యాలమ్మ తల్లి

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో హెచ్‌పీ పెట్రోల్ బంక్ ఎదురుగా ఉన్న ముత్యాలమ్మ తల్లి దేవాలయంలో ఆషాడ శుద్ధ పౌర్ణమి సందర్భంగా గురువారం అమ్మవారిని శాకాంబరీ దేవిగా అలంకరించారు. 50 రకాలకు చెందిన కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో ఆలయంలో వేంచేసి ఉన్న అమ్మవారిని అలంకరించగా.. అర్చకుడు కంచెల సతీష్ శర్మచే అభిషేక పూజలు జరిగాయి.

